
కురుపాం మండలంలోని బోరిగెడ్డపై కర్రల వంతెన నిర్మించిన గిరిజనులు

- జిల్లాలో ఏజెన్సీ వాసులకు తప్పని కష్టాలు
- వాగులు, గెడ్డలు, నదులను దాటలేని పరిస్థితి..
- ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు
- విద్య, వైద్యానికి దూరమవుతున్న వైనం
- ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- వంతెనల నిర్మాణంపై దృష్టి సారించని గత వైసీపీ సర్కారు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు

వానొస్తే.. వణికే!


పాచిపెంట మండలంలో అమ్మవలస గెడ్డ ఇలా..

పార్వతీపురం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): వాన కురిస్తే చాలు.. జిల్లాలో ఏజెన్సీ వాసులకు కష్టాలు తప్పడం లేదు. ప్రాణాలకు తెగించి.. వాగులు, గెడ్డలు, నదులను దాటి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాలపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు ఏటా వర్షాకాలంలో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా వైద్యసేవలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాజాగా పాచిపెంట మండలంలో వాగు దాటుతుండగా.. ఇద్దరు ఏకలవ్య ఉద్యోగులు మృతి చెందడం కలకలం రేగింది. జిల్లాలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నూతన ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.


కొమరాడ మండలం లింగన్నదొరవలస, బూర్జివలస గ్రామాల మధ్య ఉన్న గెడ్డ

ఇదీ పరిస్థితి...

వాస్తవంగా ఏటా వర్షాకాలంలో జిల్లాలోని కొన్ని గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. వాగులు, నదుల్లో వరద ప్రవాహం అధికంగా ఉండడంతో వారంతా ఇళ్లు దాటి బయటకు రాలేని పరిస్థితి. ఒక్కోసారి వాగులు దాటే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర వేళల్లో మాత్రం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గతంలో కొమరాడ మండలం నాగావళి నదిలో జరిగిన పడవ ప్రమాదంలో సుమారు 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత జిల్లాలో అనేక చోట్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నా స్పందించే వారే కరువయ్యారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం వంతెనల నిర్మాణం దృష్టి సారించలేదు. దీనిపై ఎన్నికల్లో ఇచ్చిన హామీని గాలికొదిలేసింది. కొన్ని వంతెనల పనులకు గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ.. ఆయా నిర్మాణాలను పూర్తి చేయించలేకపోయింది.

వంతెనలు నిర్మించాల్సిన ప్రాంతాలు కొన్ని..

● కురుపాం మండలం పరిధిలో బోరి, బండిగూడ గిరిజన గ్రామాలకు చెందిన విద్యార్థులు బోరిగెడ్డ దాటుకుని గోటివాడ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇదే ప్రధాన మార్గం కావడంతో ఆయా గ్రామస్థులు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో గెడ్డ వరద ఉధృతికి వారి కష్టాలు రెట్టింపవుతున్నాయి. దీనిపై వంతెన నిర్మిస్తామని గత ఎన్నికల సమయంలో వైసీపీ ఎమ్మెల్యే మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఇచ్చినహామీ గాలిలో కలిసిపోయింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున చందాలు వేసుకొని కర్రలతో గెడ్డపై వంతెన నిర్మించుకున్నారు. ప్రస్తుతం దాని మీద నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

● సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలం సరాయి వలస, కోటికిపెంట తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు కూడా కొండవాగు గెడ్డ మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. సరాయి వలస గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు కోటికిపెంట ఏకలవ్యకు చెందిన ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది కూడా నిత్యం ఈ వాగు దాటాల్సి ఉంది. ఈ క్రమంలో ఏటా వర్షాకాలంలో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గెడ్డ ఉధృతంగా ప్రవహించిన సమయంలో అయితే వారు పూర్తిగా గ్రామాలకే పరిమితమవ్వాల్సి వస్తోంది.

● పార్వతీపురం నియోజకవర్గం సీతానగరం మండలం చిన్న అంకలం గ్రామానికి చెందిన విద్యార్థులు సువర్ణముఖి నదిని దాటి జడ్పీ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వారి ఇక్కట్లు అన్నీఇన్నీకావు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ మండలంలో వేగోటవలస, దయానిధిపురం, పూడి బుచ్చిం పేట, గాదెలవలసకు చెందిన వారు సువర్ణముఖి నది దాటి పెద్ద అంకలం పీహెచ్‌సీకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

● కొమరాడ మండలంలో లింగన్నదొరవలస, బూర్జివలస గ్రామాల ప్రజలు, విద్యార్థులు కూడా వనకాబడి గెడ్డ దాటుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వైద్యం, ఇతర అవసరాల కోసం ఇదే మండలంలో నయా పంచాయతీ వనకాబడి, వాటకకోసు తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఈ వాగు దాటాల్సిన వస్తోంది. వర్షాకాలంలో అయితే వారు వైద్యసేవలు కూడా పొందలేకపోతున్నారు.

తప్పని నిరీక్షణ..

పాచిపెంట: మండల పరిధి వేటగానివలస, కుడుమూరు, అమ్మవలస సమీపంలో ఉన్న కొండ వాగుల గెడ్డల వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. పాచిపెంట, సాలూరు పట్టణానికి కూడా వెళ్లాలంటే ఈ కొండవాగులు తప్పనిసరిగా దాటాల్సి ఉంది. అయితే వర్షాలు కురిసే సమయంలో గెడ్డలో వరద ఉధృతి తగ్గినంతవరకు రోడ్డుకు ఇరువైపులా వాహనదారులు, ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

అధికారులను ఆదేశించాం..

పాచిపెంట మండలంలో ఈ నెల 16న జరిగిన సంఘటన దురదృష్టకరం. ఈ విషయం తెలిసిన వెంటనే గిరిజన ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలిచ్చాం. ఈ వాగును పరిశీలించి భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించాం.

-ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

సాలూరు మండలంలో..

సాలూరు రూరల్: శివరాంపురం వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో రోజూ పార్నవలస, పెదపారన్నవలస, భవానీపురం, రొంగడివాని వలస, రొంపల్లి తదితర గ్రామస్థులు వేగావతి కాజ్‌వే దాటాల్సి వస్తోంది. వర్షకాలంలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్నా.. నది దాటడడం తప్పనిసరి. మరో వైపు శివరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ కాజ్‌వే దాటుకుని రాకపోకలు సాగించాల్సి ఉంది. కాజ్‌వేకు నాచు పట్టడంతో ఎంతోమంది ద్విచక్రవాహనదారులు ఇక్కడ బోల్తా గాయాలపాలయ్యారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి బొత్స సత్యనారాయణ ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 3 కోట్లతో పనులు ఆరంభించారు. దాదాపు రూ. కోటి వెచ్చించగా.. పిల్లర్ల వేసిన అనంతరం పనులు నిలిచి పోయాయి. వంతెన నిర్మాణంపై పలు విమర్శలు రావడంతో ఎన్నికల ముందు గత వైసీపీ ప్రభుత్వం రూ. 5.95 కోట్లు మంజూరు చేసింది. అయితే టెండర్లు పిలువ లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన నిర్మాణంపై గ్రామస్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


శివరాంపురం వద్ద కాజ్‌వే ఇలా..

మరికొన్నిచోట్ల ఇలా..

పారన్నవలస నుంచి సాలూరు వెళ్లాలంటే కూరగెడ్డ దాటాల్సి ఉంది. ఇక్కడ వంతెన పనులు సగంలో నిలిచిపోయాయి. మరిపిల్లి పంచాయతీ ములక్కాయవలస, వెలగవలస వద్ద వంతెన పనులు కూడా పూర్తవలేదు. ఇటీవల ఈ పనుల్లో కదలిక వచ్చింది. భారీ వర్షం కురిస్తే దండిగాం కాజ్‌వే వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిందే. సువర్ణముఖీ నదిలో ప్రవాహం తగ్గిన తర్వాతనే కురుకూటి వెళ్లాల్సి ఉంది. దిగువ కాశాయవలస వద్ద గిరిజనులు గెడ్డ దాటాల్సి ఉంది. సోంపిగాం గిరిజనులు సారిక రావాలంటే సువర్ణముఖీ నది దాటాల్సిందే. పులివలస నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే చిట్టిగెడ్డను దాటాల్సి ఉంది.


పాచిపెంట మండలంలో కొండవాగు గెడ్డ

సీతంపేట ఏజెన్సీలో..

సీతంపేట రూరల్: పాలకొండ-హడ్డుబంగి రహదారిపై ఉన్న గొయిది గెడ్డ, చిన్నబగ్గలోని బొండి గెడ్డ, కుసిమి ప్రాంతంలో సంతమల్లి గెడ్డ, దోనుబాయికి వెళ్లే మార్గంలో చంద్రమ్మతల్లి గుడ్డి వద్ద ఉన్న గెడ్డలతో ఆయా ప్రాంతవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో వారు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిస్తే.. వైద్యసేవలు కూడా పొందలేకపోతున్నారు. గెడ్డల్లో వరద నీరు తగ్గుముఖం పట్టే వరకు గిరిజనులు, ఉద్యోగులు, ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు తప్పడం లేదు. గెడ్డలు దాటే సమయంలో కొట్టుకుపోయి తీవ్ర గాయాలపాలైన వారెందరో ఉన్నారు.

స్వరాష్ట్రానికి మృతదేహాలు..

సాలూరు, ఆగస్టు 17: పాచిపెంట మండలం సరాయివలస కొండవాగు గెడ్డలో కొట్టుకుపోయి.. మృతి చెందిన ఏకలవ్య ఉద్యోగుల మృతదేహాలను విమానంలో స్వరాష్ట్రం హర్యానాకు తరలించారు. శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై తిరుగు ప్రయాణమైన వారు గెడ్డ దాటుతుండగా.. గల్లంతైన విషయం తెలిసిందే. టీచర్ ఆర్తి మృతదేహం ఆరోజే లభించగా.. శనివారం వార్డెన్ మహేష్ మృతదేహాన్ని మాతుమూరు సమీపంలో అధికారులు గుర్తించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆసుపత్రికి చేరుకుని ఏకలవ్య, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, విమానయానశాఖ అధికారులతో మాట్లాడారు. అంబులెన్స్ ద్వారా మృతదేహాలను సాలూరు నుంచి విశాఖకు, అక్కడ నుంచి విమానంలో హర్యానా రాష్ట్రానికి పంపించారు. ఆదివారం ఉదయం అంబులెన్స్‌ల ద్వారా హర్యానా నుంచి వారి స్వగ్రామాలకు మృతదేహాలను పంపనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి.. ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.


ఏకలవ్య పాఠశాల సిబ్బంది, వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

త్వరలో కొత్త రేషన్ కార్డులు

- పాతవి మార్పు చేసేందుకు కసరత్తు
- ఆదేశాలు జారీ చేయనున్న కూటమి ప్రభుత్వం

పార్వతీపురం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన పేదలకు కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయనుంది. అదేవిధంగా ఇప్పటికే ఉన్న పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి ఇచ్చేందుకు కసరత్తు మొదలైంది. పండగలకు రేషన్ కార్డుదారులందరికీ మళ్లీ చంద్రన్న కానుకలను అందించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఆదేశాలు రానున్నాయి. ఇకపోతే ప్రతి నెలా బియ్యంతోపాటు సబ్సిడీ ధరలపై పంచదార, కందిపప్పు, ఇతర నిత్యావసరాలు అందించాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో..

వాస్తవంగా గత ప్రభుత్వం.. రేషన్‌కార్డులపై కూడా వైసీపీ రంగులు వేసింది. అప్పటి సీఎం జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోలను ముద్రించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వాటి స్థానంలో కొత్త కార్డులివ్వాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన డిజైన్లు పరిశీలనలో ఉన్నాయి. గతంలో రేషన్‌కార్డు కావాలన్నా, పేర్ల మార్పులు, చేర్పులు చేయాలన్నా.. ప్రజలు నరకం చూసేవారు. కొత్తగా పెళ్లయిన వారు, ఉమ్మడి కుటుంబం నుంచి బయటకు వచ్చిన వారికి సకాలంలో రేషన్ కార్డులు మంజూరయ్యేవి కావు. సర్వర్ పని చేయడం లేదని, ప్రభుత్వ ఆదేశాలు రాలేదని.. అక్కడున్న సిబ్బంది చెప్పేవారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన చంద్రన్న కానుకలను జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేశారు. కందిపప్పు, పంచదార, గోధుమలు ఇలా అన్నింటినీ తీసేశారు. బియ్యం పంపిణీకి మాత్రమే ప్రజా పంపిణీ వ్యవస్థను పరిమితం చేశారు. కుటుంబంలో ఎవరైనా ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉంటే.. వారికి రేషన్ అందించేవారు కాదు.. ప్రభుత్వ పథకాలకు కూడా వారిని దూరం చేశారు. ఒంటరి మహిళలకు కూడా రేషన్‌కార్డు మంజూరు చేసేవారు కాదు.



కష్టాలకు చెక్...

ప్రజా పంపిణీ వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టాలని, పేదలను ఆదుకోవాలని చంద్రబాబు సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రేషన్ కార్డుదారుల కష్టాలకు చెక్ పెట్టాలని భావించింది. దీనిలో భాగంగా కొత్తగా పెళ్లయిన వారికి, ఒంటరి మహిళలకు, వివాహాలైన వారి పేర్లను వారి తల్లిదండ్రుల కార్డు నుంచి తొలగించి రేషన్‌కార్డులు ఇవ్వనున్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండు లక్షల 81 వేల వరకు రేషన్‌కార్డులు ఉన్నాయి. త్వరలోనే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

బదిలీలు షురూ

- సిబ్బంది వివరాలు అందించాలని ఆదేశాలు జారీ

గరుగుబిల్లి, ఆగస్టు 17: ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీల సందడి ప్రారంభమైంది. ఐదేళ్లుగా ఒకేచోట అంటిపెట్టుకుని ఉన్న అధికారులు, సిబ్బందిని బదిలీ చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది బదిలీలకు సంబంధించి శనివారం జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మండల పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1, 2, 3, 4, మేజర్ పంచాయతీలకు చెందిన సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, కార్యాలయ సబార్డినేట్ సిబ్బందికి చెందిన పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదించనున్నారు. అదే విధంగా రెవెన్యూ, సెర్ప్, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్, పౌర సరఫరాలు, మైనింగ్, ఇంజనీరింగ్, దేవదాయశాఖ, రవాణా, పరిశ్రమలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులశాఖ, ఎక్సైజ్, తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి సంబంధించి జూలై 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన వారికి బదిలీ తప్పనిసరి అని ఆదేశాలు వచ్చాయి. సెప్టెంబరు 15లోగా బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది. దీనికి సంబంధించిన నియమ నిబంధనలు ఆయా శాఖల అధికారులకు ఇప్పటికే అందాయి. ఇదిలాఉండగా, సార్వత్రిక ఎన్నికల సమయంలో వేరే మండలాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు మళ్లీ సొంత మండలాలకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, వీరిని ఆ మండలాల్లోనే ఉంచుతారో, లేదంటే కదిలిస్తారో వేచి చూడాలి. ఇప్పటికే స్థానిక శాసన సభ్యులు అధికారుల జాబితాను సేకరించారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే బదిలీలు జరిగే అవకాశం ఉంది.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి చేయండి

- అధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో సహకార శాఖ అధికారులు, డీసీసీబీ మేనేజర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణతో సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. వంద శాతం కంప్యూటరీకరణ పనులు మూడు రోజుల్లో పూర్తి కావాలని స్పష్టం చేశారు. దీనివల్ల సహకార బ్యాంకుల సేవలు సభ్యులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి అభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. పర్యవేక్షణ బాధ్యతలను మండల ప్రత్యేక అధికారులకు అప్పగించాలని జిల్లా నోడల్ అధి కారి, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్. శోభికను ఆదేశించారు. సమావేశంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి, డీసీసీబీ మేనేజర్ పాల్గొన్నారు.

● జిల్లాలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయం లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. సెప్టెంబరు-1 నుంచి ఏడో తేదీ వరకు పౌష్టికాహారంపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 8న విద్యా సంస్థల్లో వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు, 17న వైద్య శిబిరాలు, 25న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణిలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహణ, మార్కెటింగ్ సదుపాయాలపై రైతులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


జిల్లా కేంద్రాసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


కారకులను కఠినంగా శిక్షించాలి

- పశ్చిమ బెంగాల్ ఘటనపై వైద్యుల నిరసన

బెలగాం, ఆగస్టు17 : పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా.. శనివారం జిల్లాలో వైద్యులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వైద్యురాలి హత్య చాలా ఘోరమని, కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని నినదించారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి వద్ద డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. అత్యవసర సేవలకు మాత్రమే హాజరయ్యారు. అంతకముందు పార్వతీపురం డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు వద్ద మానవహారం చేపట్టారు. వైద్యురాలి హత్యపై ప్రతి ఒక్కరూ స్పందించాలని కోరారు.

దిక్సూచి
DIKSUCHI

నేషనల్ లా స్కూల్లో లీగల్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీఏసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్స్యూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్ట్‌లు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్ట్‌లు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/

డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్ అనుబంధ కళాశాలల్లో

మేనేజ్‌మెంట్ కోటా

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్ఆర్ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్ఆర్ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసు కోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూలో బీఆర్క్



కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

కళాశాలలు-సీట్లు

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sS6GAamలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వారియర్ స్టోరీ

ప్రభాస్ కొత్త చిత్రం శనివారం ఉదయం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఇన్‌స్టాలో తన వీడియోలతో అందరినీ ఆకట్టుకొన్న ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'పరిత్రాణాయ సాధూనాం' అంటూ భగవద్గీత శ్లోకాన్ని ప్రచురించారు. 'ఆపరేషన్ జెడ్' అని మరొక చోట పేర్కొన్నారు. అలాగే ఈ సినిమా క్లాప్ బోర్డ్ మీద కోల్‌కతా హౌరా బ్రిడ్జ్, సుభాష్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' పతాకం, చార్మినార్.. ఉండడం ఆసక్తిరేకెత్తిస్తోంది. 1940 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ చిత్రకథలో ప్రభాస్ వారియర్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఫొటోగ్రఫీ: సుదీప్ ఛటర్జీ, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

మెల్‌బోర్న్‌లో మువ్వన్నెల రెపరెపలు



మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌కు రామ్‌చరణ్ గౌరవ అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఏటా ఈ పురస్కారం అందుకున్న వ్యక్తులు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఫెడరేషన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగిన వేడుకల్లో రామ్‌చరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఐఎఫ్ఎఫ్ఎం పురస్కారాల ప్రదానం

ఐఎఫ్ఎఫ్ఎం చిత్రోత్సవాల్లో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. చందు ఛాంపియన్ చిత్రానికి గాను కార్తిక్ ఆర్యన్ ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని కబీర్‌ఖాన్, నిథిలన్ స్వామినాథన్ (మహారాజా)తో కలసి అందుకున్నారు. ఉత్తమ నటిగా పార్వతి తిరువోతు, ఉత్తమ చిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' పురస్కారాలను దక్కించుకున్నాయి. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడి పురస్కారం విక్రాంత్‌మాసేకు దక్కింది. సంగీత దర్శకుడు ఏ. ఆర్ రెహమాన్ విశిష్ట పురస్కారం స్వీకరించారు.

ప్రేక్షకులు దూరమైంది అందుకే

\- దిల్‌రాజు



'ప్రేక్షకుల్ని చెడగొట్టింది మేమే.'మీరు ఇంట్లోనే కూర్చోండి.. నాలుగు వారాల్లో సినిమాను ఓటీటీలో చూపిస్తాం' అని వారిని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం' అని నిర్మాత దిల్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవు' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా తీయడం గొప్ప కాదు. ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడం ముఖ్యం' అన్నారు. 'రేవు' సినిమా కాన్సెప్ట్ బాగుంది. ఈ చిత్రాన్ని చూసి 'నేనూ రివ్యూ రాస్తా' అన్నారు దిల్ రాజు. నిర్మాతల్లో ఒకరైన మురళి మాట్లాడుతూ 'ఒక మంచి చిత్రంతో నా సినీ జర్నీ మొదలైంది. మా సినిమాను చూసి ఆదరించండి' అని కోరారు. తక్కువ బడ్జెట్‌లోనే ఎంత అద్భుతంగా సినిమా తీయవచ్చో దర్శకుడు హరినాథ్ నిరూపించారు' అని ప్రభు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.

గాయని పి. సుశీలకు అస్వస్థత



ప్రముఖ గాయని పి. సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో ఆమె చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు.

ఇన్ ప్రోగ్రెస్



'ఆయ్' టీమ్‌కు ఎన్టీఆర్ అభినందనలు

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందిన 'ఆయ్' చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్ సాధించింది. ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూలు కూడా రావడంతో టీమ్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. శనివారం యూనిట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆయన అభినందనలు పొందారు. బాక్సాఫీసు దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' హిట్ కావడంతో ఎన్టీఆర్ వారిని అభినందించారు. నార్నే నితిన్, నయన్ సారిక, అంకిత్ కొయ్య, నిర్మాతలు బన్నీ వాసు, ఎస్.కె.ఎన్. శనివారం ఎన్టీఆర్‌ను కలిశారు.

రోషన్ హీరోగా 'ఛాంపియన్'



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించే కొత్త చిత్రం 'ఛాంపియన్' షూటింగ్ శనివారం మొదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ను దర్శకుడు నాగ్‌అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. సరికొత్త పాత్రలో రోషన్‌ను ప్రజెంట్ చేయడానికి ఓ విభిన్నమైన స్క్రిప్ట్‌ను దర్శకుడు ప్రదీప్ సిద్ధం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్. మది, కళా దర్శకుడు! తోట తరణి, నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్.

భయపెట్టేందుకు సిద్ధం



అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ 2'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ్ సుబ్రహ్మణ్యన్, ఆర్. సి రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

లారీ, కారు ఢీ: ఒకరు మృతి

కొత్తవలస: లారీ, కారు ఢీకొన్న సంఘటనలో ఒక యువకుడు మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తవలసకు చెందిన నలుగురు యువకులు పెళ్లి పనుల నిమిత్తం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత పెందుర్తి వైపు వెళుతుండగా మంగళపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీకొంది. కారును నడుపుతున్న మేళాస్త్రి నాయుడు(24) అక్కడికక్కడే మృతి చెందగా, అందులో ఉన్న గొరపల్లి లోకేష్, బూసాల షణ్ముఖ, పూసర్ల షణ్ముఖ అనే ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విశాఖపట్టణం తరలించినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి ..

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి-గొట్లాం రైల్వే స్టేషన్ల మధ్య ఆప్‌లైన్‌పై గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీరావు శనివారం తెలిపారు. రైల్వే ఎస్ఐ కథనం మేరకు.. శనివారం వేకువజామున పట్టాల పక్కన సుమారు 34 సంవత్సరాల వయస్సు ఉండి, గ్రీన్‌కలర్ ఫ్యాంటు, రెడ్, బ్లాక్ చారలుగల టీ షర్టు ధరించిన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లుగా గుర్తించారు. మృతుని వద్ద రాయగడ నుంచి చత్రపూర్ వెళ్లే రైల్వే టిక్కెట్టు మినహా ఎటువంటి ఆధారాలు లేవు. మృతుని ఆచూకీ తెలిసేసే వరకు మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రిలో భద్రపరచనున్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9491813163 నెంబర్‌కు సంప్రదించాలి.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

బొండపల్లి: బాలిక అదృశ్యం ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదయ్యింది. ఈ విషయంపై ఎస్ఐ కె.లక్ష్మణరావు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కెరటాం గ్రామానికి చెందిన యాండ్రపు ధనలక్ష్మి(16) అనే బాలిక ఈనెల 15న విశాఖలో ఉంటున్న వరుసకు అన్నయ్య అయిన హర్షను చూడడానికి బయలుదేరింది. తల్లి సీతమ్మ కూతురిని ఆటోలో పంపించింది. అదేరోజు సీతమ్మ.. హర్షకు ఫోన్ చేసి, ధనలక్ష్మి వచ్చిందా.. అని వాకబు చేసింది. అతను రాలేదని చెప్పడంతో సీతమ్మ స్థానిక పోలీసులను ఆశ్రయించింది. సీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అతిథిగృహంలో అగ్నిప్రమాదం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అతిథిగృహం అగ్నిప్రమాదానికి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ గృహాన్ని గత రెండేళ్లుగా నిర్వహణ లేకుండా వదిలేశారు. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి భవనం కనిపించని పరిస్థితి ఏర్పడింది. సుమారు వారం రోజుల కిందట ఈ భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గృహంలోని ప్రధానద్వారం, ఫ్రిజ్, సోఫాలు అగ్నికి ఆహుతయ్యాయి. వీటితో పాటు కొన్ని కాగితాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఎన్నో ఏళ్లుగా సీతంపేట ఐటీడీఏకు వచ్చే వీవీఐపీలు, వీఐపీలకు విడిదినిచ్చే ఈ భవనం ఇంతా కళావిహీనంగా మారడం వెనుక అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇకనైనా ఐటీడీఏ అధికారులు స్పందించి ఈ గెస్టుహౌస్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. కాగా అతిథిగృహం చుట్టూ పేరుకుపోయిన చెత్త, చెదారంతో పాటు తుప్పలను తొలగించామని ఏపీవో చినబాబు తెలిపారు. ఇటీవల అతిథిగృహంలో షార్ట్ సర్క్యూట్ జరిగి, అగ్ని ప్రమాదం సంభవించిదని చెప్పారు. ఈ భవనంలో విలువైనవి ఏవీ లేవని, పనికి రాని వస్తువులు మాత్రమే కాలిపోయినట్లు పేర్కొన్నారు. గెస్టుహౌస్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకు వస్తామని తెలిపారు.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ


యువతకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

విజయనగరం క్రైం: యువత సత్ప్రవర్తనతో మెలగాలని, రాత్రి సమయాల్లో రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి రోడ్డుపై తిరుగుతున్న యువతను స్టేషన్‌కు తరలించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి 11 గంటల తర్వాత రోడ్లపై ఎవరూ కన్పించినా చర్యలు తప్పవన్నారు. దుకాణాలు 11 తర్వాత మూసివేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు దుర్గాప్రసాద్, మురళీ, ఏఎస్ఐ పైడితల్లి పాల్గొన్నారు.

బొడ్డవలస వద్ద ట్రెంచ్‌ల ఏర్పాటు

● ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు చర్యలు

రేగిడి: బొడ్డవలస నదీ తీర ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా నిరోధించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్‌సిబ్బంది యంత్రాలతో నదీతీరంలో బొడ్డవలస వద్ద నాలుగు చోట్ల ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. నదిలో నుంచి ఇసుకను బయటకు తీసుకువెళ్లకుండా రోడ్డును బ్లాక్‌చేశారు. ఇక్కడ ఉన్న రక్షిత బావుల వద్ద నుంచి ఇసుక అక్రమంగా తరలించడం నిషేధించారని, ఎవరైన తరలిస్తే రౌడీషీట్ ఓపెన్‌చేసి కేసులు నమోదుచేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. తహసీల్దార్ ఎల్లారావు కూడా రక్షిత బావుల వద్ద నుంచి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలని వీఆర్వోలు, వీఆర్ఏలను అప్రమత్తంచేసినట్లు రెవెన్యూవర్గాలు తెలిపాయి.

జిల్లా అధికారులకు నివేదిక: ఏవో


ఎండిన నారుమళ్లను పరిశీలిస్తున్న ఏవో

లక్కవరపుకోట: వర్షాలు లేకపోవడంతో నారుమళ్లు పూర్తిగా ఎండిపోవడంపై జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని వ్యవసాయాధికారి స్వాతితెలిపారు.శనివారం కల్లేపల్లి, రేగ, తామరాపల్లి గ్రామాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయిన నారు మళ్లను వీపీఏ అప్పారావు, రైతులతో కలిసి పరిశీలించారు. నారుమళ్లన్నీ ఎండిపోయి కనీసం ఉభాలు చేయడానికి పనికిరాకుండా పోయాయని తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

రాజాం రూరల్: లోక్‌అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవా సంఘ అధ్యక్షులు, సీనియర్ సివిల్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ సూచించారు. శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి పీఎస్‌వీబీ కృష్ణ సాయితేజ, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబరు 14న ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు తిరిగి చెల్లించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామినాయుడు, ఏజీపీ శెట్టి పోలారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వివేక్ ఆనంద్ శ్రీనివాస్

వంతెన లేక.. వర్షాకాలంలో అగచాట్లు

● ఎన్నికల హామీగా మారిన వైనం ● గెడ్డ పొంగిపొర్లితే విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు ● ఇదీ ఏడొంపులగెడ్డ పరిస్థితి

ఏడొంపులగెడ్డపై వంతెన లేకపోవడంతో కొత్తరేగ, పాతరేగ గ్రామాల ప్రజలు, విద్యార్థులు వర్షాకాలంలో అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణం ఎన్నికల హామీగా మిగిలిపోయింది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఆ తర్వాత విస్మరిస్తున్నారు. గెడ్డ పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో నిత్యావసరాలకు అవస్థలు తప్పడం లేదు.

- రామభద్రపురం

మండలంలోని కొత్తరేగ, పాతరేగ గ్రామాల మధ్య ఏడొంపులగెడ్డపై వంతెన నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు దశాబ్దకాలం నుంచి కోరుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులకు ప్రచారాస్త్రంగా మారింది. ఎన్నికలు పూర్తయిన తర్వాత బ్రిడ్జి నిర్మాణాన్ని విస్మరిస్తున్నారని కొత్తరేగ, పాతరేగ గ్రామస్థులు వాపోతున్నారు. దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మాణం కలగా మారిందని చెబుతున్నారు. వర్షాకాలంలో ఏడొంపులగెడ్డ పొంగిపొర్లడంతో నిత్యం రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాతరేగ గ్రామానికి వెళ్లడానికి విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కొన్నిసార్లు ప్రాణాలకు తెగించి గెడ్డదాటుతున్నామని కొత్తరేగ గ్రామస్థులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని ప్రకటించారే తప్పా అమలుకు నోచుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. కొండకోనల్లో కురుస్తున్న వర్షాలకు ఒక్క సారిగా వరద ప్రవాహం రావడంతో ఈ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో దొంగ గెడ్డగా భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు, జిల్లా అధికారులు స్పందించి ఏడొంపులగెడ్డపై వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి..

కొత్తరేగ, పాతరేగ గ్రామాల మధ్య ఉన్న ఏడొంపులగెడ్డ పొంగిపొర్లడంతో ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని కొత్తరేగ సర్పంచ్ కిల పర్తి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎన్నోసార్లు వినతిపత్రాలు అధికారులకు అందించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. వర్షాకాలంలో ఈ గెడ్డ ఎప్పుడు పొంగి పొర్లుతుందో తెలియదని, ఇటువంటి పరిస్థితిలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్సివస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.


వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

గంజాయిపై ఉక్కుపాదం

- సాగు, రవాణా నియంత్రణపై దృష్టిపెట్టండి
- పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలు
- ఏజెన్సీతో అనుసంధానమైన రహదారుల్లో చెక్‌పోస్టుల వద్ద నిఘా
- తరచూ పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్
- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశం


ఎస్పీలతో సమావేశం నిర్వహిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టీ

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా నియంత్రణపై గట్టిగా దృష్టిసారించాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వంద రోజుల కార్యాచరణపై ఎస్పీలతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. కైలాసగిరిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశమై గంజాయి నియంత్రణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చర్యలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్న వారిని పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. నేరస్తులను పట్టుకునేందుకు నిర్దిష్ట కాలపరిమితిని డీఐజీ నిర్దేశించారు. గంజాయిని ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు వినియోగించే మార్గాలను గుర్తించాలని ఎస్పీలను ఆదేశించారు. ఏజెన్సీతో అనుసంధానమైన మైదాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతో పాటు తగినంత సిబ్బందిని నియమించి, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేయాలన్నారు. తరచూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న 59 మందిపై పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు చేశామని, దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉందని డీజీఐ వివరించారు. కంటైనర్లలో గంజాయి రవాణా గుర్తించేందుకు వీలుగా నర్సీపట్నం, అనకాపల్లిలో స్నిఫర్‌డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తెచ్చామని అనకాపల్లి ఎస్పీ దీపికాపాటిల్ వివరించారు. 2024లో ఇంతవరకూ విశాఖపరిధిలోనే 223 గంజాయి కేసులు నమోదుచేసి రూ.4.75 కోట్ల విలువైన 9,517 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఐజీ వివరించారు. ఈ కేసుల్లో 545 మందిని అరెస్టు చేయగా...వారిలో 249 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారన్నారు. నిందితుల నుంచి 155 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి సాగవుతున్న ప్రాంతాలు ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించామన్నారు. గంజాయి సాగుచేస్తున్న ప్రాంతాలకు ఎస్పీలు, ఇతర అధికారులు వెళ్లి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఐజీ ఆదేశించారు. దీనికోసం ప్రభుత్వ శాఖల అంతర్గత కమిటీ ఏర్పాటుచేసి గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కళాజాతలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిషేధం, వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై గిరిజనులకు అర్థమయ్యేలా జంక్షన్లు, ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపికా పాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్, పార్వతీపురం మన్యం ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏడీపీఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ వి.గోవిందరావు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

● మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



మంత్రి శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు: సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విజయనగరంలోని ఐఎంఏ హాల్లో ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడికళా వెంకటరావు మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్ విలువలతో పనిచేయడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం మాధవ, తోయక జగదీశ్వరీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం వర్కింగ్ జర్నలిస్టుల నిరంతరం పాటు పడుతున్నారన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై తమ సంస్థ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని,ఛత్తీస్‌ఘడ్‌లో తెచ్చిన రక్షణ చట్టం ఇక్కడ కూడా అమలు చేయాలని, జర్నలిస్టుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో- 38 రద్దుచేసి అందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు.అనంతరం సర్ సీవై చింతామణి విగ్రహానికి మంత్రి గుమ్మడి సంధ్యా రాణి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పీఎస్ ఎస్వీ ప్రసాద్, ఎంఎస్ఎన్ రాజు, రాధాకృష్ణ, మహాపాత్రో, పంచాది అప్పారావు, వైఎస్ పంతులు, డేవిడ్ రాజు, లింగాల నర్సింగరావు, కేజే శర్మ, సముద్రాల నాగరాజు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

● గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం మక్కువ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమెపాల్గొని, మాట్లాడారు. గిరిశిఖర గ్రామాల్లో డోలీల మోత లేకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులను అందించాలన్నారు. జైకా నిధులతో వెంగళరాయ సాగర్ జలాశయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. గర్భిణులకు వసతిగృహం ఏర్పాటుచేసి మాతా శిశువు మరణాలు నివారణకు కృషి చేస్తామని హామీఇచ్చారు.కార్యక్రమంలో ఎంపీపీ మర్రి పారమ్మ, జడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

● కూటమి కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.మక్కువలో ఆమెకు శనివారం ఘన స్వాగతం లభించింది. స్థానిక మజ్జి గౌరమ్మ గుడి నుంచి మెయిన్‌రోడ్డు జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం నంద సర్పంచ్ బిడ్డిక రమేష్, తూరుమామిడి సర్పంచ్ రెడ్డి కృష్ణమూర్తినాయుడు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

మిగతా అన్నక్యాంటీన్లు తెరిచేందుకు ప్రణాళిక

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున


అన్న క్యాంటీన్‌లో వడ్డిస్తున్న నాగార్జున

విజయనగరం రూరల్: తర్వాత దశలో వచ్చే నెలాఖరు నాటికి మిగతా అన్న క్యాంటీన్లు తెరిపించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. శనివారం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కొద్దిసేపు భోజనాలు వడ్డించడంతోపాటు నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలో వివిధ పనులు, చిరు వ్యాపారాలు చేసుకునే వారు, వృత్తిదారులు, వ్యవసాయకూలీలు, తాపీ పని వారు రూ.15 కే అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం లభిస్తుందన్నారు.. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు సంపన్నులు సైతం అన్న క్యాంటీన్ నిర్వహణకు తమ వంతు విరాళాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, కర్రోతు నర్సింగరావు, కోండ్రు శ్రీనివాసరావు, మైలిపిల్లి పైడిరాజు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్

● నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు

విజయనగరం రింగురోడ్డు: ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలన్న ఉద్దేశంతో ఇంటింటా సర్వే చేపడుతున్నట్టు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. వారంతా నగరంలోని ప్రతిఇంటికి వెళ్లి కొళాయి కనెక్షన్ల వివరాలు నమోదు చేసుకుని నివేదిక రూపొందిస్తారని తెలిపారు. ఉన్న ఇంటి కొళాయిని ఎంత మంది వినియోగించుకుంటున్నారన్న వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు.ఇందుకోసం ప్రతి ఇంటికి వచ్చేతమ సిబ్బందికి ప్రజలు సహకరించి వివరాలు ఇవ్వాలని కోరారు.ఈ సర్వే వల్ల భవిషత్‌లో కుళాయి కనెక్షన్లు అవసరమైన వారికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. సొంతింటి వారే కాకుండా అద్దె ఇంట్లో ఉన్న కూడా ఇంటి యాజమానికి విషయాన్ని తెలియజేసి ఇంటిపన్ను రసీదును చూపించాలని కోరారు. దీని వల్ల కుళాయి కనెక్షన్లు అందించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు మళ్లీ వాయిదా

జిల్లాలో పలుచోట్ల శనివారం కూడా మళ్లీ ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించిన ఎన్నికల్లో కోరం లేకపోవడం తదితర కారణాల వల్ల పలుచోట్ల ఎన్నికలు నిర్వహించలేదు.

● **వంగర:** మండలంలోని శివ్వాం యూపీ పాఠశాలలో శనివారం కూడా కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదావేసినట్లు అధికారులు దుర్గారావు, రమణమ్మ తెలిపారు. ఈనెల ఎనిమిదో తేదీన జరిగిన ఎన్నికల్లో మూడు, ఎనిమితో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావపోవడంతో ఎన్నిక వాయిదాపడిన విషయం విదితమే. కాగా శనివారం తల్లిదండ్రులు ఉదయం గం ఏడు నుంచి సాయంత్రం వరకు ఎవరు రాకపోవడంపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదావేశారు.

● **రేగిడి:** చిన్నశిర్లాం యూపీ పాఠశాలలో ఎనిమిదో తరగతికి సంబంధించి మళ్లీ కోరం లేక ఎన్నిక వాయిదాపడింది. గతంలో ఒకటి, రెండు తరగతులకు ఎన్నిక నిర్వహించిన విషయం విదితమే. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఎనిమిదో తరగతి తప్పా అన్ని తరగతుల ఎన్నిక పూర్తైనట్లు ఎంఈఓ వరప్రసాదరావు తెలిపారు. ఎన్నికసమయంలో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకోవడంతో ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో వచ్చి బందోబస్తు నిర్వహించారు. కాగా మునకలవలస, తునివాడ, సోమరాజుపేటల్లో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది.

మహిళలకు ఉచిత బస్సు సదుపాయం


బస్సును ప్రారంభిస్తున్న లలిత కుమారి

శృంగవరపుకోట: రానున్న రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. శనివారం శృంగవరపుకోట డిపోలో కొత్త ఆల్ట్రా పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. ఎస్.కోట-విశాఖ బస్సు సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. డిపో మేనేజర్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలను కాపాడుకుందాం

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమణ

బెలగాం: ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ తూట్లు పొడుస్తున్నారని, వాటిని కాపాడుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా సమితి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తోందని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో సెప్టెంబరు 1 నుంచి 3 వరకు జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, సభ్యులు ఈవీ నాయుడు, దుర్గారావు, కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొత్సకు అభినందన

బొబ్బిలి: విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అభినందించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు డాక్టర్ కాశినాయుడు, తమ్మిరెడ్డి దామోదరరావు, బొమ్మి అప్పలనాయుడు ఉన్నారు.

● **రాజాం:** స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన బొత్స సత్యనారాయణను రాజాం వైసీపీ నాయకులు ఆయన నివాసంలో శనివారం కలుసుకున్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్, పట్టణ పార్టీ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వంగర ఎంపీపీ ఉత్తారావల్లి సురేష్‌కుమార్ కలిశారు.

ఏఎస్పీ అస్మాపరహీన్ బదిలీ

విజయనగరం క్రైం: జిల్లా అదనపు ఎస్పీ అస్మాపరహీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సీఐడీ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆమె 2022లో అదనపుఎస్పీగా పదోన్నతి పొంది కృష్ణా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత బదిలీపై విజయనగరం ఏఎస్పీ అడ్మిన్‌గా 15 నెలలు బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం బ్యాగులు పంపిణీ చేశారు. గత వారం ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు అందించామని హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోట్నూరు శివాజీ, రహీం షేక్‌లాల్, సతీష్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

విజయనగరం టౌన్: రాజీవ్ క్రీడామైదానంలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండోఅసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు ప్రారంభించారు. ఈ పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఇక్కడ ప్రతిభ కనబరి చినవారు సెప్టెంబరు ఏడో తేదీ నుంచి ఆగ్రాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

'విద్యాప్రవేశ్' ప్రారంభం


మాట్లాడుతున్న లక్ష్మణరావు

బొబ్బిలి రూరల్: పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యాప్రవేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని 90 రోజుల పాటు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

రాజాం: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ ఇంటి పన్నులు వసూలుచేయాలని ఆదేశించారు. చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకు రావలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం పెనుబాక గ్రామంలో గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సకాలంలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● వైద్య విద్యార్థిని అత్యాచారం ఘటనపై జిల్లా వ్యాప్తంగా మిన్నంటిన నిరసనలు ● ఆస్పత్రుల్లో నిలిచిపోయిన సాధారణ వైద్య సేవలు

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థిని అత్యాచారం.. హత్య ఘటనపై ఐఎంఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై తరచూ దాడులు జరుగుతున్నాయని, వీటిని ప్రభుత్వం అరికట్టాలని కోరారు. వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనకు నిరసనగా ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహా సాధారణ వైద్య సేవలు నిలుపుదల చేశారు. దీంతో పలువురు రోగులు ఇబ్బందులు పడ్డారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



సాలూరులో..



కురుపాం రూరల్: నీలకంఠాపురంలో..



సీతంపేట: ఏరియా ఆసుపత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న వైద్యులు



పాలకొండ: నిరసన తెలుపుతున్న వైద్యులు



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఆసుపత్రిలో..



కొమరాడ: మండల కేంద్రంలో..



సీతానగరం: హనుమాన్ కూడలిలో నిరసన ర్యాలీ



కురుపాం: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



భామిని: నిరసన తెలుపుతున్న వైద్యులు



సీతంపేట రూరల్: సీతంపేట గ్రామంలో నిరసన ర్యాలీ



వీరఘట్టం: నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది



జియ్యమ్మవలస: చినమేరంగి సీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

స్పందించారు.. రోడ్డును బాగు చేయించారు



రోడ్డును బాగు చేయిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద తోటపల్లి - గుణుపూర్ ప్రధాన రహదారిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం బాగు చేయించారు. ఇటీవల పెదమేరంగి కూడలి వద్ద రోడ్డు దుస్థితిని వివరిస్తూ కొందరు వాహన చోదకులు, స్థానికులు రోడ్డును బాగు చేయించడమ్మా అంటూ వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. కొందరి యువకుల పర్యవేక్షణలో ప్రధాన రహదారిపై ఉన్న భారీ గుంతలను మెటల్, సిమెంటు మట్టితో కప్పించి బాగుచేయించారు. దీంతో వాహన చోదకులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రోడ్డు పనులు శాశ్వత ప్రాతిపదికన చేయించి భవిష్యత్‌లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కురుపాం నియోజకవర్గ ప్రజలు ఆమెను కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి



ప్రధాన పంప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్ర ప్రజల తాగు నీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. శనివారం తోటపల్లి వద్ద గల ప్రధాన, నవిరి కాలనీ వద్ద గల తాగునీటి సరఫరా పంప్ హౌస్‌లను పరిశీలించారు. తాగునీటి సరఫరాకు శాశ్వత ప్రాతిపదికన చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి చిన్న సమస్యనూ పరిగణనలోకి తీసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

సమయ పాలన పాటించాలి

మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలను ఎమ్మెల్యే విజయచంద్ర శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. సంబంధిత విభాగాల అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. అలాగే ఆయా విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.సీతారామ్, కౌన్సిలర్ కె.నారాయణరావు, జనసేన నాయకులు అనిల్, ఈపీ ఆనంద్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రాలవారీగా ఉపాధ్యాయులను భర్తీ చేయాలి

● ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

సాలూరు రూరల్: ఏకలవ్య ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ రాష్ట్రాల వారీగా స్థానికులతో ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. వట్టిగెడ్డలో కొట్టుకు పోయి మరణించిన హర్యానా ఉపాధ్యాయుల కుటుంబాలను ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ఏకలవ్య పాఠశాలల్లో రాష్ట్రాల యూనిట్‌గా స్థానిక భాష తెలిసిన వారితో భర్తీ ప్రక్రియ చేయాలని కేంద్రానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ తరఫున ఇప్పటికే వినతి పంపించామన్నారు. రాష్ట్రాల యూనిట్‌గా స్థానిక మాతృభాష తెలిసినవారితో రిక్రూట్‌మెంట్ విధానం ఉండే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు.

గైర్హాజరయితే అభివృద్ధి ఎలా?

కొమరాడ: సమావేశాలకు అధికారులు గైర్హాజరైతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఎంపీపీ శెట్టి శ్యామల ప్రశ్నించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోతే మండలాన్ని ఎలా అభివృద్ధి పథంలో నడపగలమని అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా సమావేశాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎంపీడీవో మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ శరత్‌బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

సాలూరు రూరల్: మామిడిపల్లిలో కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. గడదేశి శంకరరావు తన గొర్రెల మందను శాలలో ఉంచారు. ఆ శాలలోకి శనివారం వేకువజామున కుక్కలు చొరబడి వాటిపై దాడి చేశాయి. ఈ దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెలను చూసి ఆయన కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే విజయం

పార్వతీపురంటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే విజయం తథ్యమని ఆర్డీవో హేమలత అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన వేదాంత కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఐఐటీ సాట్లతో పాటు, ఈ ఏడాది ఉత్తమ ర్యాంకులు సాధించిన మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రవీంద్రరాజు, కవి జి.గౌరునాయుడు, డాక్టర్ పీబీపీఆర్ నాయుడు(నాని), కళాశాల చీఫ్ మెంటార్ డాక్టర్ పి.అప్పారావు, డైరెక్టర్ ఎస్ఎల్ నాయుడు, డీన్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ మృతదేహం లభ్యం

పాచిపెంట: కొండవాగు గెడ్డలో కొట్టుకుపోయి గల్లంతైన వార్డెన్ మృతదేహం శనివారం పాచిపెంట మండలంలోని మాతుమూరు సమీపంలో లభ్యమయ్యింది. మండలంలోని సరాయివలస సమీపంలోగల కొండవాగు గెడ్డలో శుక్రవారం సాయంత్రం ఏకలవ్య ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హర్యాణాకు చెందిన ఆర్తి(23), వార్డెన్ మహేష్(27)లు గల్లంతయ్యారు. అయితే అదే రోజు టీచర్ మృతదేహం లభ్యమయ్యింది. శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టగా వార్డెన్ మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాలను వెంటనే సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

ఇద్దరు ఉపాధ్యాయుల మృతికి కారణమైన మండలంలోని సరాయివలస సమీపంలోని కొండవాగు గెడ్డను పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత శనివారం పరిశీలించారు. అనంతరం మృతదేహాలు లభ్యమైన ప్రదేశాలను కూడా పరిశీలించారు. హైలెవెల్ బ్రిడ్జి అవసరమని ఆర్డీవో గుర్తించారు. కొండవాగు గెడ్డ దాటాల్సిన గిరిజన గ్రామాలు ఎన్ని ఉన్నాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణరావును అడిగి తెలుసుకున్నారు. సరాయివలస, శివలింగపురం, నందవలస కోదవలస, రిట్టపాడు గ్రామాల గిరిజనులతో పాటు గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలతో పాటు ఏకలవ్య ఆశ్రమ పాఠశాల ఉందని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్డీవో వెంట ఆర్ఐ రహనరావు, వీఆర్వో మురళీ ఉన్నారు.



కొండవాగుగెడ్డను పరిశీలిస్తున్న ఆర్డీవో హేమలత

ప్రభుత్వాలు ఆదుకోవాలి..

సాలూరు/రూరల్: హర్యానా ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయిన సరాయివలస వద్ద వట్టిగెడ్డ (రాయిమాను వాగు) ప్రాంతాన్ని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, రాష్ట్ర ఎస్టీ కమిషనర్ చైర్మన్ డీవీజీ శంకరరావుతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలను చూశారు. మృతదేహాలను ప్రభుత్వం వారి స్వగ్రామాలకు చేర్చాలని కోరారు. వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు.

పాఠశాల కమిటీల ఎన్నిక వాయిదా

సీతానగరం: మండలంలోని నిడగల్లు ఉన్నత పాఠశాలతో పాటు అంటిపేట, కొత్తవలస ప్రాథమిక పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు మరోకసారి వాయిదా పడినట్లు ఎంఈవోలు వెంకటరమణ, సూరిదేముడు తెలిపారు. శనివారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. నిర్ణీత సమయానికి కమిటీ సభ్యులు ఎన్నికల నిర్వహణకు సరిపడా కోరం లేనందున వాయిదా వేసినట్లు వారు తెలిపారు. ఉన్నత పాఠశాలలో 7వ తరగతి కమిటీ సభ్యులు ఎన్నికలు నిర్వహణకు 22 మంది తల్లిదండ్రులు హాజరై ఎన్నికలు నిర్వహణకు 50 శాతం మంది సభ్యులు అవసరం కాగా ఆ సంఖ్యకు ఒక్కరు తగ్గడంతో తప్పనిసరి పరిస్థితిలో వాయిదా వేస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ గోవిందరావు సందర్శించారు.

జియ్యమ్మవలస: పెదబుడ్డిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక మళ్లీ వాయిదా పడినట్టు ఎంఈవో-2 ముదిలి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎన్నికకు తల్లిదండ్రులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశామని చెప్పారు. బందోబస్తుకు వెళ్లిన ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు తన సిబ్బందితో వెనుదిరిగారు. ఇదిలా ఉండగా డంగభద్ర గదబవలస జీసీ స్కూల్ (టీడబ్ల్యూ)లో శనివారం ఎస్ఎంసీ ఎన్నిక నిర్వహించారు.

బలిజిపేట మండలంలో ప్రశాంతం

సీతానగరం(బలిజిపేట): బలిజిపేట మండలంలోని చిలకలపల్లి ఉన్నత పాఠశాల, అజ్జాడ, నారాయణంనాయుడువలస ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈవో సామల సింహాచలం శనివారం తెలిపారు. అలాగే చాకరాపల్లి పాఠశాలలో నిబంధనల ప్రకారం తగిన కోరం లేనందున ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో తెలిపారు.

సోదర భావంతో మెలగాలి

గరుగుబిల్లి: కళాశాలల విద్యార్థులు సోదర భావంతో మెలగాలని పార్వతీపురం జిల్లా అదనపు న్యాయాధికారి ఎస్.దామోదరరావు సూచించారు. మండలంలోని వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ వారాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, న్యాయవాదులు టి.జోగారావు, ఎం.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి బి.హరిరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

గరుగుబిల్లి: మండలంలోని రావివలస ప్రధాన కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గొర్లి కిషోర్‌కుమార్ కోరారు. ఈసందర్భంగా వారు శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రధాన రహదారిలో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయని, వీటి వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అలాగే ప్రధాన మార్గం నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి గతుకులమయంగా తయారయ్యిందన్నారు. చీకటి పడిందంటే ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ మార్గం గుండా జియ్యమ్మవలస, కురుపాం మండలాలకు ప్రయాణాలు చేస్తుంటారన్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు దృష్టి సారించి స్పీడ్ బ్రేకర్లతో పాటు రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

నిబంధనల మేరకు ఈ-పంట నమోదు చేయాలి



తోటపల్లిలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో విజయభారతి

గరుగుబిల్లి: గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను విధిగా ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి సూచించారు. తోటపల్లి, నాగూరు, సంతోషపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ-పంట నమోదును ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సమయంలో రైతు పండించే ప్రతి పంటను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నమోదు వల్ల ధాన్యం కొనుగోలు, క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారం, తదితర సౌకర్యాలు ఉంటాయన్నారు. పంచాయతీల పరిధిలో సెప్టెంబరు 15లోగా నమోదు పూర్తి కావాలని ఆమె సూచించారు. ఈ పరిశీలనలో సిబ్బంది ప్రవల్లిక ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి దృష్టి సారించాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంఈవోలు ఎస్.నాగభూషణరావు, కె.కొండలరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు బడి బయట ఉన్నవారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో 13 సచివాలయాలకు సంబంధించిన వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించాలి

పార్వతీపురం రూరల్: మండలంలోని బందులప్పి పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశించారు. శనివారం ఈ విద్యుత్ స్తంభాలను ఆయన పరిశీలించారు. ఈపీడీసీఎల్ ఈఈ గోపాల్‌నాయుడు, డీఈ సీహెచ్‌వీ రమణను పిలిపించి పరిస్థితిని వివరించారు. తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోనుదేవి చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, శంకరరావు, కోట శ్రీధర్, బేత లక్ష్మణరావు, నాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రణాళిక, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047పై జిల్లా అధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికి ఉన్న అవకాశాలను పేర్కొంటూ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రతి రంగంలో కనీసం 15 శాతం వృద్ధి సాధించాలన్నారు. అక్టోబరు 2న విజన్ డాక్యుమెంట్ విడుదలకు అవకాశం ఉందన్నారు.

సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వండి

పాచిపెంట: దశాబ్దాల కాలంగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలంటూ శనివారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజశేఖర్‌కు గిరిజనులు వినతిపత్రం అందజేశారు. సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, మండల ఉపాధ్యక్షులు కొర్రా కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కుడుమూరు సర్వే నెంబరు 48లో 782 ఎకరాలకు గిరిజనులకు హక్కులు కల్పించాల్సి ఉందని సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు అన్నారు. సకాలంలో పరిష్కారం చేయకపోతే ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని గిరిజన సంఘం నాయకులు తెలిపారు.

ఆర్థిక అవగాహన అవసరం

సాలూరు రూరల్: గిరిజనులు ఆర్థిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని జాతీయ గిరిజన ఆర్థిక సంస్థ జోనల్ అధికారి కృష్ణవేణి పిలుపునిచ్చారు. మామిడిపల్లి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప్‌లో భాగంగా శనివారం కొఠియా గ్రూప్ నేరేళ్లవలసలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రీజియన్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ వి.సునీల్ వర్మ, ఎఫ్ఐసీడీవో కిశోర్, నేతలు గొర్లె రాజారావు, రాంబాబు, కొఠియా గ్రూప్‌నకు చెందిన వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పాలకొండ: విద్యార్థులు మత్తుకు చిత్తు కావద్దని డీఎస్పీ జి.వి.కృష్ణారావు పేర్కొన్నారు. తమ్మినాయుడు విద్యా సంస్థలో ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్, ప్రిన్సిపాల్ తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ్‌ను నియమిస్తూ.. శనివారం రాత్రి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2021 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సబ్ కలెక్టర్‌గా నియమించడంతో పాటు పార్వతీపురం ఐటీడీఏకు ఫుల్ ఎడిషనల్ ఇన్‌చార్జి పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పార్వతీపురం ఆర్డీవో హేమలతను ఎక్కడకు బదిలీకు చేశారో తెలియలేదు.

నేడు కలెక్టర్ పర్యటన

గుమ్మలక్ష్మీపురం: కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదివారం గుమ్మలక్ష్మీపురం మండలంలో పర్యటించనున్నారు. గొరడ రాయగడ, జమ్ము తదితర గిరిజన గ్రామాల్లో పర్యటించి వరినాట్లు కార్యక్రమంలో పాల్గొనున్నట్టు జట్టు సంస్థ డైరెక్టర్ పాడినాయుడు తెలిపారు. అనంతరం కురపాం మండలం కొండలేవిడి గ్రామాన్ని సందర్శించనున్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి చర్యలు

సాలూరు రూరల్: బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 6, 7, 8, 9 తరగతులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు చర్యలు చేపడుతున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్.ఆశీర్వాదం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు కావాల్సిన విద్యార్థులు ఆధార్, కుల, విద్యార్హత తదితర ధ్రువపత్రాలతో నేరుగా పాఠశాలకు రావాలని సూచించారు.

బొత్సకు అభినందన

పాలకొండ: విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మర్యాదపూర్వకంగా శనివారం కలిసి, అభినందించారు. బొత్సను కలిసిన వారిలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, రాజాం ఇన్‌చార్జి తలే రాజేష్, పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వంగర ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, బూరాడ జగన్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు భద్రత కల్పించాలి

సాలూరు రూరల్: గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా శాఖ సభ్యుడు ఎన్‌వై నాయుడు కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గెడ్డలో కొట్టుకుపోయి మరణించిన హర్యానాకు చెందిన ఉపాధ్యాయుల మృతదేహాలను స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలన్నారు.